సాక్షి బాపట్ల

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



ఎస్పీని కలసిన పీఎస్ఐలు

నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని స్టేషన్లలో శిక్షణ పొందుతున్న పీఎస్ఐలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



ముంపు పొలాలు పరిశీలన

కొల్లిపర: మండలంలోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన ఉద్యాన పంటలను జిల్లా ఉద్యాన అధికారి జి.రవీంద్రబాబు సోమవారం పరిశీలించారు.



ఘనంగా చండీ హోమం

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చండీహోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రీరాముడిని తాకిన సూర్యకిరణాలు



బల్లికురవ: దసరా శరన్నవరాత్రులు, మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం మండలంలోని కొత్తపాలెం రామాలయాన్ని సూర్యకిరణాలు తాకాయి. దక్షిణాయన పుణ్యకాలంలో పర్వదినాన సూర్యకిరణాలు శ్రీరామ చంద్ర స్వామిపై పడటం ఎంతో శుభపరిణామమని ఆలయ అర్చకులు ఐనవోలు సుబ్బాచార్యులు శివసాయి అన్నారు. పంచామృతాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, హరిద్రా చూర్ణ లేపనం అష్టోత్తర శతనామ పూజ, ప్రత్యేక అలంకరణ, దివ్యమంగళ హారతి చేపట్టారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



బాపట్ల: సచివాలయం ఉద్యోగులు ఆత్మగౌరవ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. సచివాలయంలో వలంటీర్లను తొలగించి వారు చేసే ప్రతి పనిని తమతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిపై సర్వేల భారం పెట్టి మరీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పని ఒత్తిడితో తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

నూతన ఉపాధ్యాయులకు అభినందన



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్ లైన్‌లో 117 మందికి, ఆన్‌లైన్‌లో 217 మందికి డీఎస్సీ కోచింగ్ అందించారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ 14 మంది, స్కూల్ అసిస్టెంట్‌గా నలుగురు ఉద్యోగాలు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయటంతోపాటు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రూప్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్ – అనకాపల్లి (07059) ప్రత్యేక రైలు అక్టోబర్ 6, 13, 20, 27 తేదీల్లో ప్రతి సోమవారం రాత్రి ఏడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07060) 7, 14, 21, 28 తేదీల్లో ప్రతి మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. రెండు మార్గాల్లో ఈ రైలు చర్లపల్లి, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, కృష్ణా కెనాల్, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది.



సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన చందోలు బగళాముఖి



కొల్లూరు పార్వతి అమ్మవారి ఆలయంలో సరస్వతీపూజలో పాల్గొన్న విద్యార్థులు



కావూరు రామలింగేశ్వర ఆలయంలో విశేషాలంకరణలో అమ్మవారు



ఎంవీరాజు పాలెంలో సరస్వతీదేవి అలంకారంలో...

జ్ఞాన ప్రదాయిని సరస్వతీదేవి

భక్త జనుల అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞాన జ్యోతిని వెలిగించే జ్ఞాన ప్రదాయినిగా సరస్వతీదేవిగా భక్తులకు అమ్మవారు సోమవారం దర్శనమిచ్చారు. చందోలులోని బగళాముఖి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ చిన్నారులను బగళాముఖి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి సన్నిధిలో పూజలు చేసిన పలకలు, పుస్తకాలు, పెన్నులు చిన్నారులకు అర్చకులు అందజేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. జిల్లాలోని పలు ఆలయాల్లో కూడా అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

– చందోలు(కర్లపాలెం)/కొల్లూరు/చెరుకుపల్లి

కృష్ణమ్మ కన్నెర్ర

- జల దిగ్బంధంలో లంక గ్రామాలు
- వరద మరింత పెరిగే అవకాశాలు
- పంటలను ముంచెత్తిన వరద నీరు
- గట్లపై నుంచి పొర్లి ప్రవహిస్తున్న వరద
- రహదారులు జలమయం
- లంకవాసులను అప్రమత్తం చేస్తున్న జిల్లా అధికారులు



కొల్లూరు మండలం పెసర్లంక – పెదలంక అరవింద వారధి అడుగు భాగాన్ని తాకుతూ వరద ఉధృతి

కొల్లూరు/రేపల్లె: కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. వరద ప్రవాహం నది గట్లపై నుంచి పొర్లి ప్రవహిస్తుండటంతో వేల ఎకరాలలో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. నది పరివాహక గ్రామాలలోని రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లంక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద తీవ్రత అధికంగా ఉండటంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమైంది.

ప్రమాదకర స్థాయిలో వరద తీవ్రత

ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా 6,74,926 క్యూసెక్కులు బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల చేశారు. తర్వాత సాయంత్రానికి 6,46,821 క్యూసెక్కులకు ఈ మొత్తం చేరింది. పెసర్లంక అరవింద వారధి అడుగు భాగాన్ని వరద నీరు తాకుతూ ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద భారీగా వచ్చి చేరతుండటంతో 6 లక్షల క్యూసెక్కుల పైచిలుకు నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

వేలాది ఎకరాలలో పంటలు మునక

వరద ప్రభావం నది తీర గ్రామాలలోని ఉద్యాన పంటలపై పడింది. వరద నది అంచులపైనుంచి పొంగిపొర్లుతుండటంతో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని వేల ఎకరాల పంట నీట మునిగింది. రూ. వందల కోట్లు వెచ్చించి సాగు చేస్తున్న అరటి, పసుపు, కంద, తమలపాకు, జామ, మినుము, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. మండలంలోని సుగ్గునలంక, చిలుమూరులంక, చింతర్లంక, ఈపూరులంక, పెదలంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, తోకలవారిపాలెం, కిష్కిందపాలెం, జువ్వలపాలెం, దోనేపూడి, కొల్లూరు పరిధిలోని వేలాది ఎకరాలలో సాగైన వాణిజ్య పంటలు వరద నీటి బారినపడ్డాయి. వరద ప్రభావం మరో నాలుగు రోజులపాటు కొనసాగవచ్చునని అంచనా వేస్తున్నారు. రైతులు ఆవేదనలో ఉన్నారు.



పెనుమూడిలోని పునరావాస కేంద్రంలో పల్లెపాలెం గ్రామస్తులు

లంక గ్రామాలకు రాకపోకలు బంద్

లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గాజుల్లంక – ఆవులవారిపాలెం రోడ్డు, పోతార్లంక – గాజుల్లంక మార్గం, సుగ్గునలంక చప్టా, దోనేపూడి లో లెవల్ చప్టా, భట్టిప్రోలు మండలం వెల్లటూరు కరకట్ట దిగువన రహదారుల పైనుంచి వరద ప్రవాహం అధికంగా ఉంది. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తడికలపూడి, జువ్వలపాలెం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం, తోకలవారిపాలెం, పోతార్లంక, గాజుల్లంక, సుగ్గునలంక, చిలుమూరులంక, శివరామపురం, తురకపాలెం, గుంటూరుగూడెం, మద్యగూడెం, రావిలంక గ్రామాలు జల దిగ్బంధంలోకి వెళ్లాయి. కృష్ణా జిల్లా కనిగిరిలంక, మునగపల్లిలంక, ఆముదార్లంక, గుంటూరు జిల్లా అన్నవరపులంక, కొత్తూరులంక గ్రామాలకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి. కొల్లూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు 19 మంది వచ్చారు. వారిలో గర్భిణి ఉండగా.. వైద్య సిబ్బంది వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



కొల్లూరు మండలం సుగ్గునలంక వద్ద వరద ముంపు బారినపడిన అరటి పంట

భయాందోళనల్లో పెనుమూడి వాసులు

వరద నీరు పెనుమూడి ప్రాంతవాసులను భయాందోళనలకు గురిచేస్తోంది. ఉరకలెడుతూ కడలివైపు పరుగులెడుతున్న కృష్ణమ్మ తీరప్రాంత ప్రజలను గడగడలాడిస్తోంది. గతంలో చోటు చేసుకున్న అనుభవాలతో వారు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. తీరంలోని పెనుమూడి ఘాట్‌లోని మెట్లన్నీ మునిగిపోయాయి. గతంలో రేపల్లె పట్టణాన్ని ముంచివేసిన వరద సంఘటనను తలచుకుని ఇక్కడి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెనుమూడి పల్లెపాలెం గ్రామంలోకి వరద నీరు రాకుండా ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు

కరకట్ట బలోపేతానికి ఏర్పాట్లు

కృష్ణానది వరదలతో కరకట్టకు గండి పడకుండా బలహీన ప్రాంతాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. అప్రమత్తమై అక్కడ పటిష్టపరిచేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గోనెసంచులలో ఇసుక నింపి బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాలలో వరద నీరు చేరకుండా, ఉధృతంగా ప్రవహించకుండా ఇసుకతో నింపిన బస్తాలను అడ్డుగా ఉంచుతున్నారు.

తీరప్రాంత వాసులను అప్రమత్తం చేశాం

- అధికారులతో నిరంతరం వరదలపై సమీక్ష
- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



పెనుమూడి పల్లెపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె: వరద ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ చెప్పారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలలో ఆయన సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కరకట్ట పటిష్టతపై అధికారులతో నిరంతరం చర్చిస్తున్నట్లు చెప్పారు. పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కేంద్రాలలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆశ్రయం పొందిన ప్రజలకు అల్పాహారం, భోజన వసతులను సమకూర్చటంతోపాటు మెడికల్ క్యాంప్‌లను సైతం ఏర్పాటు చేశామన్నారు. పెనుమూడి పల్లెపాలెం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ తదితర గ్రామాలలో పర్యటించారు. కార్యక్రమంలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, ఆర్‌సీ అధికారులు పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటూ చెట్టు నీడన..

'సాక్షి' చొరవతో పునరావాస కేంద్రానికి తరలింపు



కొల్లూరు కరకట్ట దిగువన పాకలోకి వరద నీరు రావడంతో చెట్టు కిందకు చేరిన కుటుంబాలు

కొల్లూరు: పనుల కోసం సొంత ఊళ్లను విడిచి ఏళ్ల తరబడి ఇక్కడే నివాసాలు ఏర్పరుచుకొని జీవిస్తున్న కుటుంబాలకు చెట్టు నీడే పునరావాసంగా మారింది. కృష్ణా నదికి వచ్చిన వరదల కారణంగా కొల్లూరు కరకట్ట దిగువన నివసిస్తున్న నిరుపేదల తాటాకుల పాకలలోకి వరద నీరు ప్రవేశించింది. పాకలను వదిలి సమీపంలో ఏడుగురు పసిపిల్లలతో నలుగురు మహిళలు చెట్టు నీడన తలదాచుకున్నారు. సోమవారం వరద నీటి పక్కనే చెట్టు నీడన చిన్నారులతో ఉన్న కుటుంబాలను గమనించిన 'సాక్షి' వారి పరిస్థితి గురించి ఆరా తీయడంతో గోడు వెళ్లబోసుకున్నారు. కొల్లూరులో రోజువారీ హోటళ్లతోపాటు, ఇతర వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించే వీరు ఏరోజుకు ఆరోజు వచ్చే సంపాదనతోనే జీవనం వెళ్లబుచ్చుతున్నారు. వీరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలివెళితే అధికారులు పనులుకు వెళ్లేందుకు అనుమతించకపోతే చేసే పని పోతుందన్న భయంతో చెట్టు నీడనే ఉన్నారు. దీంతో 'సాక్షి' వారి పరిస్థితిని తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లింది. తక్షణం స్పందించిన ఆయన.. రెవెన్యూ సిబ్బందిని వారి వద్దకు పంపించారు. పనులకు వెళ్లడానికి అభ్యంతరం ఉండదని భరోసా కల్పించి, వారిని పునరావాస కేంద్రానికి తరలించారు.

అర్జీలను వెంటనే పరిష్కరించండి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల: ప్రజలు తమ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసిన అర్జీలను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, పలువురు జిల్లా అధికారులతో అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రోజునే వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో పింఛన్ తీసుకోలేకపోతే కారణాలు గుర్తించాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో, ఆర్డీఓలు, ప్రతి మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా 28 కల్లా అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యంతో పాటుగా మిగిలిన వస్తువులు పంపిణీ చేయాలన్నారు. రెవెన్యూ భూ సమస్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిషేధిత జాబితా, 22ఏకి సంబంధించి ప్రతి శుక్రవారం సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు ఫైల్స్‌ను పరిష్కరిస్తామన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) మల్లి కార్జునరావు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ లవన్న, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాదవి, డీఎఫ్ఓ రవిశంకర్, డీపీఓ ప్రభాకరరావు, సీపీఓ ఏ.ఎస్.రాజు, డీఈఓ పురుషోత్తం, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విజయమ్మ, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ తర్వాత సీఐపై తగిన చర్యలు

- అంబేడ్కర్ విగ్రహ స్థాపనకు సహకరిస్తాం
- బాపట్ల ఆర్డీవో గ్లోరియా, డీఎస్పీ రామాంజనేయులు



మాట్లాడుతున్న బాపట్ల ఆర్డీవో గ్లోరియా

మార్టూరు: అంబేడ్కర్ విగ్రహ స్థాపనకు అన్ని విధాలా సహకరిస్తామని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ హాలులో సోమవారం సాయంత్రం డేగరమూడి గ్రామంలోని ఇరువర్గాలతో నిర్వహించిన సమావేశంలో అధికారులు మాట్లాడారు. ఆర్డీవో గ్లోరియా మాట్లాడుతూ.. విగ్రహ స్థాపనకు ఎన్నుకున్న స్థలం తాలూకు పూర్వాపరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామ, మండల కమిటీల ఆమోదం అనంతరం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. అనుమతులు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. అప్పటివరకు గ్రామాల్లోని ఇరువర్గాలు ఎలాంటి విభేదాలు తలెత్తకుండా సంయమనంతో వ్యవహరించాలని కోరారు.

సీఐపై చట్టప్రకారం చర్యలు

డీఎస్పీ గోగినేని రామాంజనేయులు మాట్లాడుతూ దళిత యువకులు జ్యోతి పోతులూరి, అల్లడి ప్రమోద్ కుమార్‌లపై సీఐ శేషగిరి లాఠీచార్జి చేశారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర్ ఆదేశాలతో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. బాధిత యువకుల వైద్య పరీక్షల రిపోర్టులు, ఇతర వివరాలను పరిశీలించి ఎస్పీకి నివేదిక పంపనున్నట్లు చెప్పారు. నిజ నిర్ధారణ అనంతరం సీఐ ప్రమేయం రుజువైతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ రాజా దిబోరా మాట్లాడుతూ విగ్రహ స్థాపనకు సంబంధించిన అంశాన్ని జిల్లా పరిషత్ అధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

దళిత నాయకుల నినాదాలు..



నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఈ సందర్భంగా సమావేశంలో ఒకానొకదశలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దళిత యువకులపై అక్రమ కేసులు బనాయించి లాఠీచార్జికి పాల్పడిన సీఐను సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నాయకులు చార్వాక, నీలం నాగేంద్రరావు తదితరులు నినాదాలు చేశారు. డేగరమూడి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఏకపక్ష నిర్ణయాలపై అధికారులు విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ రామాంజనేయులు జోక్యం చేసుకొని దళిత నాయకులను శాంతపరిచారు. గ్రామాల్లోని ఇరువర్గాలు అంబేడ్కర్ విగ్రహ స్థాపన కోసం కమిటీ వేసుకొని అనుమతులు వచ్చాక ప్రశాంత వాతావరణంలో విగ్రహ స్థాపన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి. ప్రశాంతి, సీఐ శేషగిరి, డేగర మూడి గ్రామప్రజలు, నాయకులు వైఎస్సార్ సీపీ మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	36,167
అమ్మకాలు	25,839
నిల్వ	4,715

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,200
నంబరు-5	10,000-14,100
273	10,500-13,600
341	10,000-14,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,400
నంబరు-5	10,000-14,000
341	10,000-14,800
4884	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,600
బాడిగ-355	10,000 - 15,000
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,000
తాలుకాయలు	6,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,700
బాడిగ - 355	10,000-15,000
దేవనూరు డీలక్స్	10,500-14,200
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 569

కొమ్ములు : 416 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,450	10,300	10,300

కాయలు : 216 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,450	10,300	10,000

మొత్తం అమ్మకాలు : 100.50 క్వింటాళ్లు

ప్రజల ఫిర్యాదులపై సత్వర చర్యలు

ఎస్పీ బి.ఉమామహేశ్వర్



వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల: ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అర్జీలలోని వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీలను పరిష్కరించడంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ పోలీస్ అధికారులను హెచ్చరించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యలపై 56 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీశ్ నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో పేదలకు వైద్యం దూరం

బాపట్ల: పేదవాడికి అనునిత్యం వైద్యం అందుబాటులో ఉండాలంటే మెడికల్ విద్య ప్రభుత్వంలోనే ఉండాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వాసుమల్ల వాసు పేర్కొన్నారు. ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న నిరసన పోస్టర్లను సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను నిర్మించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమవుతోందని, దీన్ని అంతా వ్యతిరేకించాలని ఆయన కోరారు. మంగళవారం ఉదయం 10గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవనం వరకు ప్రదర్శన ఉంటుందని, పట్టణ ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బడుగు ప్రకాశ్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి మండే విజయకుమార్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అడే చందు, జమ్ములపాలెం సర్పంచ్ కటికల యోహోషువా, బాపట్ల నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలపర్తి గోపి, నాయకులు నర్రావుల వెంకట్రావు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వాసుమల్ల వాసు, నేతలు

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

డాక్టరు ఎం.గోపీనాథ్

బాపట్ల: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ సమ్మె చేపట్టారు. సోమవారం అత్యవసర వైద్యసేవలను మాత్రమే అందించామని, మంగళవారం, బుధవారం పూర్తిగా నిలుపుదల చేస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎం.గోపీనాథ్ ప్రకటించారు. ఇప్పటికే వైద్యపరమైన అన్ని సేవలను నిలుపుదల చేస్తునట్లు ప్రభుత్వానికి తెలియజేశామని పేర్కొన్నారు. వైద్యశాలల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇన్-సర్వీస్ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పేలో 50శాతం ట్రైబల్ అలవెన్సు మంజూరు చేయాలని, నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద వైద్యులకు రూ.5వేలు ఇవ్వాలని కోరారు. వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తప్పిపోయిన పాప తల్లిదండ్రుల చెంతకు



చీరాల అర్బన్: తప్పిపోయిన పాపను చీరాల ఒన్‌టౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు జె.పంగులూరు మండలానికి చెందిన నాలుగు సంవత్సరాల పాప ఆరాధ్య చీరాల ఎంజీసీ మార్కెట్ వద్ద సోమవారం తప్పిపోయింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన సిబ్బందిని, శక్తి టీం సభ్యులను అప్రమత్తం చేశారు. గంట వ్యవధిలోనే పాపను గుర్తించి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తమ పాపను సురక్షితంగా అప్పగించిన పోలీసులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జె పంగులూరు: మద్యం తాగి బైక్ మీద వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని ముప్పవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సర్వీసు రోడ్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ముప్పవరం గ్రామంలో జాతీయ రహదారిపై చిలకలూరిపేట వైపు వెళుతున్న సర్వీస్ రోడ్డులో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళుతూ సైడ్ డివైడర్‌ని ఢీకొన్నారు. మద్యం తాగి ఉండటం వల్ల అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో చిలకలూరిపేటకు చెందిన ఒక వ్యక్తి తలకు గట్టి దెబ్బ తగిలి ప్రమాద స్థలంలోనే మృతిచెందాడు. మరో వ్యక్తికి బలమైన గాయాలు అవటంతో అతన్ని అంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. వీరి వివరాలు తెలియరాలేదు. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసిన యువకుడు

యర్రబాలెం(మంగళగిరి): ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసిన ఘటన యర్రబాలెం బీసీ కాలనీలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని యర్రబాలెం బీసీ కాలనీకి చెందిన మైనర్ బాలిక అదే ప్రాంతానికి చెందిన సందీప్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలికను వివాహం చేసుకోవాలని కుటుంబసభ్యులు కోరగా నిరాకరించాడు. దీంతో బాలిక కుటుంబసభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

ప్రజలకు తగ్గనున్న వైద్య ఖర్చులు

గుంటూరు మెడికల్: అత్యవసర మందులు, వైద్య పరికరాలపై ప్రభుత్వం జీఎస్టీని 12 నుంచి ఐదు శాతానికి తగ్గించడం వల్ల ప్రజలకు ఖర్చులు తగ్గుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా శిశువులకు ఉపయోగించే న్యాప్కిన్లు, ఫీడింగ్ బాటిల్స్, వ్యక్తిగత ఆరోగ్య బీమా అంశాలపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపును ఇచ్చారని పేర్కొన్నారు. క్యాన్సర్ కారకమైన పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న జీఎస్టీ 28 నుంచి 40 శాతానికి పెంచడం వల్ల వినియోగం తగ్గుతుందన్నారు. తద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని తెలిపారు. వైద్యశాఖ అధికారులు, వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

చట్టాలపై వృద్ధులకు అవగాహన

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా న్యాయ విజ్ఞాన సంస్థలో సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి కార్యదర్శి ఎం.కుముదిని సదస్సును ప్రారంభించారు. వృద్ధులకు న్యాయపరంగా ఉన్న సెక్షన్లు, హక్కులు, పిల్లల ద్వారా మోసపోయిన వారికి తిరిగి ఆస్తిని పొందే చట్టాల గురించి ఆమె వివరించారు. వృద్ధులు ఎదుర్కొనే పలు సమస్యలు, వాటి పరిష్కారాల గురించి స్టేట్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు తెలియజేశారు. సీహెచ్.పరమేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్స్, వృద్ధులు పాల్గొన్నారు.

ముగిసిన రాజ్ భాషా వేడుకలు

లక్ష్మీపురం: గుంటూరు డివిజన్ పరిధిలో ఈనెల 14 నుంచి 29 వరకు నిర్వహించిన రాజ్ భాషా పక్షం -2025 వేడుకలు సోమవారంతో ముగిశాయి. గుంటూరు పట్టాభిపురంలోని డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో డీఆర్ఎం సుధేష్ఠ సేన్ మాట్లాడారు. వేడుకల్లో భాగంగా హిందీ వర్క్‌షాప్‌లు, హిందీలో సాంకేతిక సెమినార్లు, డిపార్ట్‌మెంటల్ సమావేశాలు, హిందీ కీబోర్డ్ శిక్షణ, హిందీ పోటీలు, వ్యాసం, వక్తృత్వం, టైపింగ్, క్విజ్, జ్ఞాపకశక్తి, హిందీ పదజాలం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. హిందీని అధికారిక భాషగా ప్రచారం చేయడం మన బాధ్యతని చెప్పారు. డీజీఎం శ్యామ సుందర్ సాహు మాట్లాడుతూ రాజ్ భాష అమలు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎస్. రమేష్ కుమార్, బ్రాంచ్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జూనియర్ వరల్డ్ కప్‌లో ముఖేష్‌కు రజతం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఢిల్లీలో నిర్వహిస్తున్న జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్ షూటింగ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో గుంటూరుకు చెందిన ముఖేష్ నేలవల్లి రజతం సాధించాడు. ఈ మేరకు మెంటార్, అతని తండ్రి నేలవల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ముఖేష్ వెళ్లిన ప్రతి అంతర్జాతీయ పోటీలోనూ పతకం సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఓటు దొంగ ఎన్డీఏ కూటమి

కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

బాపట్ల: ఓటు దొంగ ఎన్డీఏ కూటమి అని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్న ఎన్డీఏ కూటమికి ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్వ సభ్య సమావేశాన్ని బాపట్ల పట్టణంలోని సూర్య కాళీ ఫంక్షన్ ప్లాజాలో ఇన్‌చార్జ్ గంటా అంజిబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శీలం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ దొంగ ఓట్లతో గెలిచిందని ఆరోపించారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా గెలిపించుకోవాలని, దాని కోసం అంతా కలిసి కృషి చేయాలని తెలిపారు. రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం దొంగ ఓట్లతో గెలిచిందని ఆరోపించారు. గంటూరు మాజీ శాసనసభ్యులు మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి చేతులు దులుపుకుంటున్న ప్రాంతీయ పార్టీల దుస్థితిని ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పరిపాలన పారిశ్రామికవేత్తలకు దాసోహంగా ఉందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి నిదానంగా నడుస్తోందని, పేద, బడుగు వర్గాలపై ఆర్థిక భారాన్ని మోపుతోందని విమర్శించారు.

కౌలు రైతుల సమస్యలపై అక్టోబర్ 13, 14 తేదీల్లో ఆందోళన

లక్ష్మీపురం: కౌలు రైతుల సమస్యలపై అక్టోబర్ 13, 14 తేదీల్లో మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు చెప్పారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులందరికీ భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేయాలని కోరారు. ఈ క్రాప్ నమోదు చేసి ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర నష్ట పరిహారాలు వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష మంది కౌలు రైతులున్నారని, 70 శాతం వారే సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, సాంబిరెడ్డి, కృష్ణ, అమ్మిరెడ్డి, నీలాంబరం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘ నేతలు

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

యద్దనపూడి: మండలంలోని జగ్గాపురం గ్రామంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు షేక్ బాజీవలి, మీరాబీ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలు కావడంతో కుమారుడు, కోడలు ఉద్యోగం నిమిత్తం దుబాయ్‌లోనూ, కుమార్తె, అల్లుడు వట్టి చెరుకూరు మండలం కుర్నూతల అడ్డరోడ్డు వద్ద చిల్లర కూల్‌డ్రింక్ షాపును ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం బాజీవలి దంపతులు కుమార్తె ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం 10 గంటలకు జగ్గాపురంలోని ఇంటికి తిరిగి రాగా, రేకుల షెడ్డు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలకు వెళ్లి చూడగా, బీరువా, కప్‌బోర్డులో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దుండగులు కప్‌బోర్డులో దుస్తుల మధ్యలో దాచి ఉంచిన వెండి, బంగారం ఆభరణాలు, నగదు అపహరించుకుపోయినట్లు బాజీవలి గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో యద్దనపూడి ఎస్సై టి.శివరామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 130 గ్రాముల బంగారం, 20గ్రాములు వెండి ఆభరణాలు, రూ.6 వేల నగదు చోరీకి గురైనట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.



బాజీవలి ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఆకట్టుకున్న వీణా సింఫనీ

తెనాలి: శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం రోజైన సోమవారం సాయంత్రం తెనాలిలో 108 వీణల ఘన సప్తస్వర సమ్మేళనం (వీణా సింఫనీ) నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) ఆధ్వర్యంలో 108 మంది వైణికుల వాద్య స్వర తరంగాలు ఒకే సమయాన ఆడిటోరియంలో ఆవహించాయి. దివ్యానంద సుడిగాలిలా భక్తులను చుట్టుముట్టాయి. స్థానిక చెంచుపేటలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఈ ఆధ్యాత్మిక సంగీత యజ్ఞాన్ని వేడుకగా చేశారు. బాలస్వామీజీ స్వయంగా వీణావాదన చేశారు. సరస్వతీ దేవికి ప్రీతిపాత్రం వీణ అని తెలిసిందే. వీణ ధ్వనిని వేదమంత్రాల నాదంతో సమానంగా పరిగణిస్తారు. ఇక 108 సంఖ్య హిందూ సంప్రదాయంలో పవిత్రమైనది. జపమాలలో ఉండే గింజల సంఖ్య 108. అంతమంది వైణికులు ఒకేసారి వీణ వాయించటమంటే జపమాల గింజల్లా ప్రతి స్వరం ఒక మంత్రధ్వనిగా మారటం అన్నమాట! శ్రోతలలో భక్తి, శాంతి, ఆనందం, ఆత్మశుద్ధిని కలిగించే ఆధ్యాత్మిక యజ్ఞంలా జరిగింది. పట్టణానికి చెందిన శ్రీ విద్యా పీఠం, సాలిగ్రామ మఠం, జయలక్ష్మి మాతృ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా సంస్థల బాధ్యులు నంబూరి వెంకటకృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరరావు, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, పల్లపోతు మురళీ మనోహర్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.




8వ రౌండ్‌కు చేరిన జాతీయ చెస్ పోటీలు



చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఆసక్తికరంగా జరిగాయి. ఎనిమిదో రౌండ్ ముగిసే సరికి, పీఎస్‌పీబీకి చెందిన నాలుగు సార్లు జాతీయ విజేత జీఎం కృష్ణన్ శశికిరణ్ తన జట్టు సహచరుడు జీఎం దీప్‌సెం గుప్తాపై గెలిచాడు. అదే జట్టుకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అభిజీత్ గుప్తా యూపీకి చెందిన ఐఎం ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వతరెడ్డిపై విజయం సాధించారు. దీంతో శశికిరణ్, అభిజీత్‌లు చెరో ఏడు పాయింట్లతో టాప్‌లో నిలిచారు. వీరికి సగం పాయింట్ వెనుక ఆరుగురు ఆటగాళ్లు (తమిళనాడు జీఎం ఇనియన్, రైల్వేస్ జీఎం దీపన్ చక్రవర్తి, నలుగురు ఐఎంలు) ఉన్నారు.

ఆర్డీ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా పాల్ సుధాకర్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా (డీడీ) బండి పాల్ సుధాకర్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన గుంటూరు మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతి ద్వారా డీడీగా విధుల్లో చేరనున్నారు. కడపకు చెందిన పాల్ సుధాకర్ హాకీ క్రీడలో ప్రతిభ చాటారు. పలుమార్లు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడంతో స్పోర్ట్స్ కోటాలో 1993లో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికై, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో విధుల్లో చేరారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, పరిపాలనా అధికారిగా పదోన్నతులు పొంది 2014 వరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో పని చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొంది గుంటూరు జీజీహెచ్‌కు 2015లో బదిలీ అయ్యారు.

ఎస్టీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలి

నరసరావుపేట: రాష్ట్రంలో వెనుకబడిన యానాదులు అభివృద్ధి చెందాలంటే ఎస్టీ వర్గీకరణ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటే మార్గమని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసి పెంచలయ్య యానాది పేర్కొన్నారు. సోమవారం ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన చేసి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పెంచలయ్య మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 10లక్షలమందికి పైగా యానాదులు ఉన్నారన్నారు. గిరిజన తెగలలో అత్యధికంగా యానాదులు ఉన్నా సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్నింటిలోను వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఎస్సీలకు వర్గీకరణ చేసిన విధంగానే ఎస్టీలకు చేస్తే రిజర్వేషన్ పరంగా న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, బాకుల మురళి, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు,మహిళలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీదారులకు తనిఖీలు

నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే అర్జీదారులకు భద్రతా సిబ్బంది తనిఖీలు తప్పటంలేదు. గత సోమవారం నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ చట్టు బ్రహ్మం కలెక్టరేట్‌కు వచ్చి తనకు వ్యతిరేకంగా తన స్థలానికి వీఆర్ఓ సర్టిఫికేట్ జారీ చేశారంటూ పురుగుమందు తాగి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై ఇటువంటి సంఘటనలు మరోసారి జరగకుండా అధికారులు భద్రతా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోకి ముందు, వెనుక నుంచి ప్రవేశించే గేట్లను మూసేశారు. వెనుక గేటుకు తాళం వేశారు. ముందువైపున పక్కగా ఉన్న గేటు వద్ద భద్రతా ద్వారంను ఏర్పాటుచేసి అందులో నుంచి ప్రతి ఒక్కరూ దాటి వెళ్లేలా ఏర్పాటు చేశారు. దాటి వచ్చిన వారిని క్షుణ్ణంగా తనిఖీచేశారు. మహిళలను ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుల్ సహాయంతో తనిఖీ చేశారు.

ఆక్వా రంగంలో వృద్ధి సాధించాలి

నరసరావుపేట: పశువుల పెంపకం, ఆక్వా రంగాల్లో అభివృద్ధికి జిల్లాలో ఉన్న అవకాశాలు వినియోగించుకుని 16 శాతం వృద్ధి సాధించేలా పశు సంవర్ధక, మత్స్య శాఖలు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన పశువులను పెంచడం ద్వారా పాలు, మాంసం ఉత్పత్తి పెంచే అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2వేల పశువుల షెల్టర్ల నిర్మాణ అనుమతులకు దస్త్రం సమర్పించాలన్నారు. ఈసందర్భంగా సూక్ష్మసేద్య పరికరాలపై జీఎస్టీ తగ్గుదల వలన కలిగే ప్రయోజనాలను గురించి రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకటరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ ఆంజనేయులు పాల్గొన్నారు. కొండమోడు-పేరేచర్ల మధ్య జాతీయ రహదారి 167 ఏజీ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులు 167 ఏజీ, 167ఏ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, జాతీయ రహదారుల ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవ రాయుడు పాల్గొన్నారు.

పులిచింతలకు 5,88,988 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 18 క్రస్ట్‌గేట్లు ఎత్తి 5,88,988 క్యూసెక్కులు పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన

మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరంపై నిరసన

నరసరావుపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం ఉదయం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తామని తెలిపారు. జిల్లాలోని ఎస్సీలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.